ఆది జ్వాల.. అనంత జ్వాల

తమిళ అగ్రనటుడు సూర్య నటిస్తున్న పాన్‌ఇండియా సినిమా 'కంగువ' అక్టోబర్ 10న దసరా కానుకగా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ ప్రమోషన్స్‌ని మేకర్స్ ప్రారంభించారు. మంగళవారం సూర్య పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలోని తొలిపాటను మేకర్స్ విడుదల చేశారు. శ్రీమణి రాసిన ఈ పాటను, దేవిశ్రీప్రసాద్ స్వరపరచగా, అనురాగ్ కులకర్ణి ఆలపించారు. 'ఆది జ్వాల.. అనంత జ్వాల.. వైర జ్వాల.. వీర జ్వాల.. దైవ జ్వాల.. దావాగ్ని జ్వాల..' అంటూ సాగే ఈ పాటలో సూర్య యుద్ధ వీరుడిగా కనిపిస్తున్నారు. దర్శకుడు శివ ఈ సినిమాను పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. కేఈ జ్ఞానవేల్‌రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీమూవీ డిస్ట్రిబ్యూషన్‌వారు తెలుగులో భారీగా విడుదల చేస్తున్నారు. దిశా పటాని కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. యోగిబాబు ప్రత్యే పాత్ర పోషిస్తున్నారు. ఇదిలావుంటే.. సూర్య 44వ పుట్టినరోజు సందర్భంగా ఆయన తాజా సినిమా ప్రకటన మంగళవారం వెలువడింది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో సూర్య గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నట్టు గ్లింప్స్ చెబుతున్నది. పూజా హెగ్డే ఇందులో కథానాయిక.

షేర్ చేయొద్దు ప్లీజ్

చిత్ర పరిశ్రమలో లీకుల సమస్య ఈనాటిది కాదు. సినిమాలోని సీన్లకు సీన్లే లీకైన సందర్భాలున్నాయి. గత ఏడాది 'గేమ్‌చేంజర్'లోని రామ్‌చరణ్ గెటప్ కూడా ఇలాగే లీకైంది. ఇప్పుడు దేవరకొండ విజయ్ సినిమా వంతు వచ్చింది. ప్రస్తుతం ఆయన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శ్రీలంకలో జరుగుతున్నది. ఇందులో దేవరకొండ విజయ్ గూఢచారి పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. తాజాగా ఈ సినిమాలోని ఆయన స్టిల్ సోషల్‌మీడియాలో ప్రత్యక్షమైంది. ట్రిమ్ చేసుకొని వైట్ డ్రెస్‌లో చాలా అందంగా కనిపిస్తున్నారు దేవరకొండ విజయ్. ఈ స్టిల్ ప్రస్తుతం ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నది. వెంటనే చిత్రయూనిట్ రంగలోకి దిగి, సోషల్ మీడియా నుంచి ఈ స్టిల్‌ని తొలగించే ప్రయత్నం చేసింది. కానీ అంతలోనే మరో స్టిల్ లీకైంది. దీంతో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ స్పందిస్తూ సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. 'డియర్ రౌడీ ఫ్యాన్స్.. మీకు అద్భుతమైన థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడానికి మా టీమ్ ఎంతో శ్రమిస్తున్నది. ప్రస్తుతం శ్రీలంకలో షూటింగ్ జరుగుతున్నది. 60శాతం షూటింగ్ పూర్తయింది కూడా. త్వరలో ఫస్ట్‌లుక్ విడుదల చేస్తాం. ఆ ఫొటో షేర్ చేయొద్దు ప్లీజ్..' అంటూ సితార సంస్థ విజ్ఞప్తి చేసింది.

చేసేటప్పుడు గందరగోళానికి గురయ్యాను

'కథను బట్టి పాత్రలుంటాయి. పాత్రలు పండితేనే కథ పండుతుంది. కాబట్టే పాత్రధారులు సాహసాలకు సిద్ధపడాలి, త్యాగాలు చేయాలి. అలా చేయలేనివాళ్లు ఆర్టిస్టులుగా పనికిరారు.' అంటూ నిర్మొహమాటంగా చెప్పేసింది అందాలభామ అంజలి. తాజాగా 'బహిష్కరణ' వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చిన అంజలి.. ఓ ఇంటర్వ్యూలో కథలో పాత్రల ప్రాముఖ్యం గురించి, తన కెరీర్ గురించి, 'బహిష్కరణ'లో చేసిన ఇంటిమేట్ సీన్స్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. 'సినిమా మీద ప్రేమతో ఈ రంగంలోకి వచ్చాను. నటన నాకు చాలా నేర్పింది. పాత్ర ప్రాధాన్యతను బట్టి నేను చేసిన హోమ్ వర్క్ నన్ను మనిషిగా మరో స్థాయిలో నిలబెట్టింది. ఓ పాత్ర కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను. ఓ పాత్ర కోసం డ్యాన్స్ నేర్చుకున్నాను. రీసెర్చ్ చేస్తూ ఉంటే జ్ఞానం ఆటోమేటిగ్గా పెరుగుతుందికదా. అందులో భయంకరమైన కష్టాలను అనుభవించిన సందర్భాలూ ఉన్నాయి. 'నవరస' అనే సిరీస్ చేసినప్పుడు కాస్ట్యూమ్స్ కారణంగా కొన్ని గంటలపాటు వాష్‌రూమ్‌కు కూడా వెళ్లలేదు. ఆ నరకం వర్ణనాతీతం.' అని తెలిపింది అంజలి. 'బహిష్కరణ'లో ఇంటిమేట్ సీన్స్ గురించి మాట్లాడుతూ 'నా లైఫ్‌లో అలాంటి సీన్స్ చేయడం ఇదే ప్రథమం. చేసేటప్పుడు కొంచెం గందరగోళానికి గురయ్యాను. నా పరిస్థితిని గమనించి, లొకేషన్‌లో ఉన్న వాళ్లందర్నీ బయటకు పంపి ఆ సీన్స్ తీశారు. పాత్రకోసం చేశాను. అది నటిగా నాధర్మం. అలాగే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లోని నా పాత్ర కోసం కూడా చాలా కష్టపడ్డా. పాత్రకైతే న్యాయం చేయగలంకానీ.. ఫలితం మన చేతిలో ఉండదు కదా.' అంటూ చెప్పుకొచ్చింది అంజలి.

బచ్చన్ మాస్ జాతర

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్‌శంకర్ దర్శకుడు. ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని రెండో గీతం 'రెప్పల్ డప్పుల్'ను ఈ నెల 25న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాటకు సంబంధించిన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో ఆయన కలర్‌ఫుల్ ఫ్యాన్సీ కాస్ట్యూమ్స్‌లో కనిపిస్తున్నారు. మిక్కీ జే మేయర్ స్వరపరచిన ఈ గీతం హుషారైన బీట్‌తో సంగీత ప్రియుల్ని ఆకట్టుకుంటుందని, రవితేజ డ్యాన్స్ ప్రత్యేకాకర్షణగా నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ సినిమాలో రవితేజ..అమితాబ్ బచ్చన్ అభిమానిగా కనిపిస్తారని, మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. భాగ్యశ్రీబోర్సే, జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, రచన-దర్శకత్వం: హరీష్‌శంకర్.

గుడి నేపథ్య కథాంశంతో

యువ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ సినీ రంగంలోకి అడుగుపెట్టి పదేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆయన కొత్త సినిమా వివరాలను వెల్లడించారు. ఈ చిత్రానికి దీనికి లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. మూన్‌షైన్ పిక్చర్స్ పతాకంపై మహేష్ చందు నిర్మిస్తున్నారు. '400 ఏళ్లనాటి గుడి నేపథ్యంలో నడిచే థ్రిల్లర్ కథాంశమిది. హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ మునుపెన్నడూ చూడని కొత్త అవతారంలో కనిపిస్తాడు. ఆయన కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఉన్నతస్థాయి సాంకేతిక ప్రమాణాలతో నిర్మిస్తున్నాం. నేటి నుంచి రెండో షెడ్యూల్ మొదలుపెడతాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర, సంగీతం: లియోన్ జేమ్స్, సమర్పణ: శివన్ రామకృష్ణ, రచన-దర్శకత్వం: లుధీర్ బైరెడ్డి.

డివోషనల్ థ్రిల్లర్ 'శివం భజే'

అశ్విన్ హీరోగా నటిస్తున్న డివైన్ సస్పెన్స్ థ్రిల్లర్ 'శివం భజే'. అప్సర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మహేశ్వర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 1న విడుదలకానుంది. మంగళవారం ట్రైలర్‌ను యువ హీరో విశ్వక్‌సేన్ విడుదల చేశారు. ఇంటర్నేషనల్ క్రైమ్ ఎలిమెంట్స్, మర్డర్ మిస్టరీతో పాటు శివుడి నేపథ్యంలో వచ్చే డివోషనల్ అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. తెలుగు తెరపై ఇప్పటివరకు రానటువంటి విభిన్న కథాంశమిదని, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కించామని, ప్రేక్షకులకు ఆద్యంతం థ్రిల్‌ని పంచడంతో పాటు సరికొత్త విజువల్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: వికాస్ బడిస, ప్రొడక్షన్ డిజైనర్: సాహి సురేష్, దర్శకత్వం: అప్సర్.

హైదరాబాద్ మ్యూజికల్ సిటీగా మారింది

దర్శకుడు మారుతి సమర్పకుడిగా వ్యవహరిస్తున్న జామ్ జంక్షన్ మ్యూజికల్ బ్యాండ్ ఈవెంట్ కర్టెన్ రైజర్ కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు తమన్, నిర్మాత ఎస్‌కేఎన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ 'జామ్ జంక్షన్ ఈవెంట్‌లో ఎవరైతే బాగా ఇంప్రెస్ చేస్తారో వారికి నగదు బహుమతితో పాటు మా సినిమాల్లో మ్యూజిక్ చేసే అవకాశం కల్పిస్తాం. ఔత్సాహిక సంగీతకారులను ప్రోత్సహించడానికి ఈ వేడుకను నిర్వహిస్తున్నాం' అన్నారు. తమన్ మాట్లాడుతూ 'నేను బ్యాండ్ ప్రోగ్రామ్స్ ద్వారానే వచ్చాను. వాటి తాలూకు ఎమోషన్స్ నాకు తెలుసు. బ్యాండ్ ద్వారా ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. ఇప్పుడు హైదరాబాద్ మ్యూజికల్ సిటీగా మారింది. ఇక్కడి నుంచి ప్రతిభావంతులైన మ్యూజీషియన్స్ వస్తున్నారు. జామ్ జంక్షన్‌లో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు మారుతి ఈ ప్రోగ్రాంను ఎంకరేజ్ చేయడం అభినందనీయం' అన్నారు.

ప్రవాస భారతీయుడి కథ

బిగ్‌బాస్ ఫేమ్ అలీ రజా, సీతా నారాయణన్ జంటగా నటిస్తున్న చిత్రం 'రామ్ ఎన్ ఆర్ఐ'. 'పవర్ ఆఫ్ ది రిలేషన్‌షిప్' ఉపశీర్షిక. ఎన్.లక్ష్మీ నందా దర్శకుడు. ముప్వా సత్యనారాయణ నిర్మాత. ఈ నెల 26న విడుదలకానుంది. ఇటీవల ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. యువతకు స్ఫూర్తినిచ్చే అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, పుట్టి పెరిగిన ఊరికి ఓ ఎన్ఆర్ఐ ఎలాంటి సహాయం చేశాడన్నదే చిత్ర కథాంశమని దర్శకుడు తెలిపారు. సందేశంతో పాటు చక్కటి కామెడీ ఉంటుందని నిర్మాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

ఆలోచనల అంతర్యుద్ధమే ఇతివృత్తంగా

'పలాస' తర్వాత మా సుధాస్ సినిమా సంస్థలో ఏదైనా యూత్‌కి నచ్చే సినిమా చేస్తే బావుంటుందని అనుకున్నాం. ఓవైపు నరకాసుర, శశివదనే సినిమాలు చేస్తూ నేను బిజీగా ఉండగానే కథ ఓకే అయ్యింది. దాంతో సెట్స్‌కి వెళ్లేందుకు కావాల్సినంత టైమ్ దొరికింది. ఆ రెండు సినిమాలు కంప్లీట్ చేసి వచ్చేసరికి 'ఆపరేషన్ రావణ్' స్క్రిప్ట్ రెడీ అయ్యింది. పర్‌ఫెక్ట్ స్క్రిప్ట్‌తో సెట్స్‌మీదకు వెళ్లాం' అని చెప్పారు హీరో రక్షిత్ అట్లూరి. ఆయన హీరోగా ఆయన తండ్రి వెంకటసత్య దర్శకత్వంలో రూపొందిన న్యూఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా రక్షిత్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. 'మా నాన్న డైరెక్షన్‌ని అందరూ నమ్మారు. రాధిక శరత్‌కుమార్, చరణ్‌రాజ్ లాంటి వాళ్లు కూడా ఎంతో సహకరించారు. తొలి సినిమానే అనుభవం ఉన్న దర్శకుడిగా నాన్న ఈ సినిమాను మలిచారు. తండ్రి దర్శకత్వంలో నటించడం అదృష్టంగా భావిస్తున్నా' అని రక్షిత్ ఆనందం వెలిబుచ్చారు. ఈ సినిమా ఫస్ట్‌హాఫ్ చూసి, కథలో సైకో ఎవరో గుర్తించి, తామిచ్చిన వాట్సాప్ నంబర్‌కి పంపిస్తే, వారికి సిల్వర్ కాయిన్ బహుమతిగా ఇస్తామని, ఆలోచనల అంతర్యుద్ధమే ప్రధాన ఇతివృత్తంగా ఈ సినిమా రూపొందిందని రక్షిత్ తెలిపారు.

'ఎటో వెళ్లిపోయింది మనసు' రీరిలీజ్

ప్రస్తుతం రీరిలీజ్‌ల ట్రెండ్ ఊపందుకుంది. అలనాటి హిట్ చిత్రాలు మరలా వెండితెరపై ప్రేక్షకుల్ని అలరిస్తున్నాయి. గౌతమ్‌మీనన్ దర్శకత్వం వహించిన ప్రేమకథా చిత్రం 'ఎటో వెళ్లిపోయింది మనసు' ఆగస్ట్ 2న రీరిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని లక్ష్మీ నరసింహా మూవీస్ పతాకంపై సుప్రియ, శ్రీనివాస్ రీరిలీజ్ చేస్తున్నారు. నాని, సమంత జంటగా నటించిన ఈ చిత్రం ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీగా మెప్పించింది. ముఖ్యంగా ఇళయరాజా స్వరపరచిన గీతాలు ప్రేక్షకుల్ని అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ అద్భుత ప్రేమకథను మరలా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఆనందంగా ఉందని మేకర్స్ తెలిపారు.

పీరియాడిక్ కథతో భగవంతుడు



తిరువీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భగవంతుడు'.గోపి.జి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. రవి పనస నిర్మాత. మంగళవారం హీరో తిరువీర్ పుట్టిన రోజుని పురస్కరించుకొని స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. గ్రామీణ నేపథ్యంలో పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, తిరువీర పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుందని, ప్రస్తుతం షూటింగ్ జరుగుతున్నదని మేకర్స్ తెలిపారు. ఫరియా అబ్దుల్లా, రిషి, రవీందర్ విజయ్, కాలకేయ ప్రభాకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్: గాంధీ, సంగీతం: కేపీ, రచన-దర్శకత్వం: గోపి.జి.

అనుభవాల్లోంచి పుట్టుకొచ్చిన కథ

బండి సరోజ్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో నటిస్తు నిర్మిస్తున్న చిత్రం 'పరాక్రమం'. శృతి సమన్వి, నాగలక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్‌గోపు, అనిల్ కుమార్ ప్రధానపాత్రధారులు. ఆగస్ట్ 22న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. 'పరాక్రమం' సంఘర్షణతో కూడుకున్న కథ అని, నా జీవితంలో ఎదురైన అవమానాలు, అనుభవాల్లోంచి పుట్టుకొచ్చిన కథ ఇదని, అందరికీ నచ్చేలా సినిమా ఉంటుందని బండి సరోజ్‌కుమార్ అన్నారు. థియేటర్‌కి వెళ్లి సినిమా చూడాలనే క్యూరియాసిటీని కలిగించేలా టీజర్ ఉందని పలువు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ ఆర్.ప్రసాద్.

అన్ని విధాలా నచ్చే సినిమా

రాజ్ తరుణ్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'పురుషోత్తముడు'. హాసిని సుధీర్ కథానాయిక. రామ్ భీమన దర్శకుడు. డా.రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్, నిర్మాతలు. ఈ నెల 26న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఇందులో నటించిన నటులు బ్రహ్మానందం, రాజారవీంద్ర, ప్రవీణ్ సినిమా విజయంపై నమ్మకం వెలిబుచ్చారు. 'మంచి సినిమా చేయాలనే కసితో ఉన్న సమయంలో వచ్చిన అవకాశం 'పురుషోత్తముడు'. నిర్మాతలు నాకు చెప్పిన మాట ఒక్కటే.. 'మన సినిమా రామాయణం అంత రమణీయంగా ఉండాలి. భారతం అంత భారీగా ఉండాలి' అని. వారు చెప్పినట్టే చేశానని అనుకుంటున్నా. అన్ని వర్గాలవారికీ అన్ని విధాలా నచ్చే సినిమా ఇది' అని దర్శకుడు చెప్పారు.